
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 195 | శుక్రవారం 20 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

ఉద్యాన పంటలకు అదనపు సహాయం చేయండి

-- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ



(అంకుశం, అమరావతి, నవంబర్ 20):

రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బ తిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుపానుల కారణంగా రాష్ట్రంలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని లేఖలో తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2, తేదీలలో వరుసగా ఏపీని తాకిన ఈ రెండు తుపానుల ధాటికి 18 జిల్లాల్లోని 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. అర్నబ్ తుఫాను కారణంగా 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిందని వివరించారు. మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న తోటల పునరుద్ధరణ, రైతులను ఆదుకునేందుకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల సాయం అందించాలని సీఎం కోరారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, బాపట్ల, తదితర జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

ఏపీకి మూడు జాతీయ అవార్డులు

- ఢిల్లీలో అవార్డులు అందుకున్న మెప్మా అధికారులు



(అంకుశం, అమరావతి, నవంబర్ 20):

పీఎం స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండించింది. ఈ ఘనతపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. పీఎం స్వనిధి పథకం అమలులో ఏపీ మెప్మా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పథకం అమలులో జాతీయ స్థాయిలో 3వ స్థానం, ఎక్కువ మందికి రుణాలు మంజూరు చేయడంలో 2వ స్థానం, స్పెషల్ క్యాంప్‌ల నిర్వహణలో 1వ స్థానం దక్కింది. అంతేకాకుండా వీధి వ్యాపారుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించే 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమంలోనూ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయి. ఇందులో అవార్డులు పొందిన రామచంద్రాపురం మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 1వ స్థానం, అమలాపురం మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 2వ స్థానం, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిజిటల్ లావాదేవీల నిర్వహణలో జాతీయ స్థాయిలో 2వ స్థానం, రుణాల పంపిణీలో కడప మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో రెండవ స్థానం దక్కించుకుంది. న్యూ ఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రం తరపున జి.బాలకృష్ణ (మెప్మా మిషన్ డైరెక్టర్), ఎన్.వెంకటేశ్వరరావు (మెప్మా మిషన్ అదనపు డైరెక్టర్), ప్రభావతి (మెప్మా పీఎం స్వనిధి పథకం) అవార్డులను అందుకున్నారు.

డిసెంబరు 6 నుంచి 14 వరకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన టీటీడీ జేఈవో డా. ఏ. శరత్





అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 20

తిరుచానూరులో కొలువైన శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ జేఈవో డా. ఏ. శరత్ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ, పోలీసు, ఇతర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వాహన సేవలతో పాటు భక్తులందరికీ శ్రీ పద్మావతి అమ్మవారి మూలమూర్తి దర్శనం సజావుగా కల్పించేలా క్యూ లైన్లు, దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు.

భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత, రవాణా తదితర సౌకర్యాలను సమర్థవంతంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు.

పటిష్టమైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ

జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసు, టీటీడీ విజిలెన్స్ విభాగాల సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పంచమి తీర్థం రోజున భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు.

భక్తుల కోసం హోల్డింగ్ పాయింట్ల పరిశీలన

అంతకుముందు జేఈవో, సీవీఎస్ఓ, జిల్లా ఎస్పీ వాహన మండపం, ఆలయ నాలుగు మాడ వీధులు, క్యూ లైన్లు, పద్మ పుష్కరిణిని పరిశీలించారు. పూడి రోడ్డులో భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న షెల్టర్లతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నవజీవన్ ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయనున్న హోల్డింగ్ పాయింట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ మనోహరం, ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటుతో కాదు.. పెట్రోల్ బాంబులతో పోరు!'

తాడిపత్రిలో ఇంటికి నిప్పు..

పులివెందులలో ఎంపీ కాన్వాయ్‌పై పెట్రోల్ బాంబులు

కడప జడ్పీ పీఠం చిచ్చు..

బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అలక..





(అంకుశం, అమరావతి, నవంబర్ 20):

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అట్టుడికిపోయింది. ఎన్నికల మాదిరి కాకుండా యుద్ధంలా మారిపోయాయి. ఒకవైపు తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై దాడి చేసి నిప్పు అంటించారు. అక్కడే పార్కింగ్‌లో ఉన్న 10 కార్లు ధ్వంసం, 20 బైక్‌లను ధ్వంసం చేశారు. టీడీపీ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులే ఈదాడులకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించారు. మరోవైపు పులివెందులలో ఎంపీ అవినాష్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి చేశారు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాళ్లు, పెట్రోల్ బాంబులతో తలపడ్డాయి. పంచాయతీ ఎన్నికల నామినేషన్ల కోసం పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వెళ్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కాన్వాయ్‌పై సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు వద్ద దాడి జరిగింది. టీడీపీ నేత, ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులు రాళ్లు, కర్రలు, కత్తులు, పెట్రోల్ బాంబులతో దాడి చేశారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించారు. పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు, వేంపల్లెలలో టీడీపీ నేతల వాహనాలకు నిప్పు పెట్టారు. రామిరెడ్డిపల్లి, ముత్తుకూరు, నాగూరు గ్రామాల్లో తోపులాటలు, లాఠీచార్జ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి.

కడప జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం చుట్టూ రేగిన చిచ్చు ఇప్పుడు కూటమి రాజకీయాలను కుదిపేస్తోంది. కూటమి జడ్పీ చైర్మన్ స్థానాల ఒప్పందంలో భాగంగా కడప స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. దీంతో జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి తన సోదరుడి కుమారుడికి జడ్పీ పీఠం దక్కించుకోవాలనే ఉద్దేశంతో తొలుత జెడ్పీటీసీకి గెలిపించుకున్నారు. జడ్పీ పీఠం దక్కుందనే ఆఖరు నిమిషంలో ఆ స్థానానికి టీడీపీకి చెందిన పుత్తా నరసింహారెడ్డి పేరును ఖరారు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆ పార్టీ నేతలతో చెప్పినట్లు తెలిసింది.ఙ

శత్రువులను గడగడలాడించే అమెరికా ఫైటర్ జెట్‌కు..

256 ఎంబీ మెమరీ కార్డు కావాలట!



ఆకాశాన్ని శాసించే అమెరికా అగ్రశ్రేణి యుద్ధ విమానం... శత్రువుల రాడార్లకు చిక్కని అత్యాధునిక ఐదో తరం స్టీల్త్ ఫైటర్ జెట్... గంటకు వేల మైళ్ల వేగంతో దూసుకెళ్లే ఎఫ్-22 రాప్టర్‌ను నడపాలంటే ఇప్పుడు సాంకేతిక ప్రపంచం ఎప్పుడో మరిచిపోయిన ఒక పాత వస్తువు కావాలి. ఆధునిక స్మార్ట్‌ఫోన్‌లో నాలుగైదు ఫోటోలు పట్టేంతటి మెమరీ కూడా లేని 256 ఎంబీ మెమరీ కార్డుల కోసం ఇప్పుడు అగ్రరాజ్యం వెతుకులాట ప్రారంభించింది.

మిషన్ డేటా కోసం నాటి సాంకేతికతే ఆధారం

ఎఫ్-22 రాప్టర్ యుద్ధ విమానంలో మిషన్ సమాచారాన్ని ఫీడ్ చేయడానికి నేటికీ తొంభైల కాలం నాటి రిమూవబుల్ ఫ్లాష్ మెమరీ కార్డులనే వినియోగిస్తున్నారు. ఫైటర్ జెట్‌లోని డేటా ట్రాన్స్‌ఫర్ కార్ట్రిడ్జ్ (డీటీసీ) వ్యవస్థలో ఈ కార్డులు కీలకం. టేకాఫ్‌కు ముందు ఫ్లైట్ రూట్లు, రేడియో ఫ్రీక్వెన్సీ సెట్టింగ్స్, శత్రు ముప్పునకు సంబంధించిన డేటాను గ్రౌండ్ సిస్టమ్స్ నుంచి విమానంలోకి ఎక్కించేందుకు, అలాగే మిషన్ పూర్తయ్యాక ఫ్లైట్ వివరాలను రీడ్ చేయడానికి పైలట్లు వీటిపైనే ఆధారపడుతున్నారు.

కొత్తవి వద్దు.. పాతవే ముద్దు

ప్రస్తుతం విపణిలో వందల గిగాబైట్లు, టెరాబైట్ల సామర్థ్యం ఉన్న స్టోరేజ్ డివైజ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, రాప్టర్‌కు మాత్రం పాత కార్డులే కావాలి. కనీసం 256 ఎంబీ సామర్థ్యం ఉన్న పీసీ స్టాండర్డ్ 95 టైప్-×× ఫ్లాష్ కార్డులు లేదా ప్యాసివ్ అడాప్టర్లతో కూడిన కాంపాక్ట్ ఫ్లాష్ (సీఎఫ్) కార్డులను సరఫరా చేయగల అమెరికన్ కంపెనీల కోసం అమెరికా ఎయిర్ ఫోర్స్ తాజాగా నోటీసు జారీ చేసింది. ఆధునిక చిప్‌లు విమానంలోని పాత హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్‌కు సరిపోకపోవడమే దీనికి ప్రధాన కారణం.

ఎఫ్ఏటీ16 ఫార్మాట్‌తోనే పొంతన


ఈ మెమరీ కార్డులు ప్రభుత్వ హోస్ట్ సిస్టమ్‌తో సమన్వయం కావడంతో పాటు, 1980ల నాటి ఫైల్ అలోకేషన్ టేబుల్ (ఎఫ్ఏటీ16) ఫార్మాట్‌లో ప్రీ-ఫార్మాట్ అయి ఉండాలని ఎయిర్ ఫోర్స్ నిర్దేశించింది. ఏవియానిక్స్ వ్యవస్థలతో సంపూర్ణ అనుకూలత సాధించడానికే ఈ నిబంధన విధించారు. తాజా అవసరాల కోసం ఎయిర్ ఫోర్స్ మార్కెట్ పరిశోధన ప్రారంభించింది. అర్హత గల సంస్థలు 2026 డిసెంబరు 1లోగా వివరాలు సమర్పించాలని కోరింది. 2030 వరకు ఈ రాప్టర్లను సేవల్లో కొనసాగించాలనే యోచనలో ఉన్న పెంటగాన్‌కు, ఈ పాతకాలపు విడిభాగాలను సంపాదించడం ఇప్పుడు ఒక సరికొత్త సవాలుగా మారింది.

శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలిలి

జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

దేశ విదేశాల నుంచి ప్రముఖులు, భక్తులు రానున్నారు

భద్రత, వసతులు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రణాళిక బద్ధ ఏర్పాట్లు



అంకుశం న్యూస్ పుట్టపర్తి, సెప్టెంబర్ 20: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు పటిష్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. పర్యావరణహితంగా ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ... ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రోజువారీ భక్తుల రాకపోకల అంచనాలు వేసి, అవసరమైన వసతులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. భక్తులు రాష్ట్రం, పొరుగు నగరాలు మాత్రమే కాకుండా దేశ, విదేశాల నుండి కూడా వస్తారని, రవాణా, వసతి ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. వసతులు, పారిశుద్ధ్యం పై మాట్లాడుతూ తాగునీరు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు, డస్ట్‌బిన్లు, వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థలు, ఫుడ్ కౌంటర్లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, అదనపు సిబ్బంది నియామకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రవాణా, రోడ్ల ఏర్పాట్లపై మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీకి ఇంటర్నల్ రింగ్ రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ సౌకర్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లపై మాట్లాడుతూ భక్తుల రాకపోకలు, ముఖ్య ప్రదేశాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పటిష్టమైన పహారా కోసం స్పష్టమైన కార్యాచరణ ఉండాలని చెప్పారు. వాటర్ పాయింట్లు ఏర్పాటు చేసి, సురక్షిత త్రాగునీరు అందించాలన్నారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులకు ఏర్పాట్లపై తగు సూచనలు జారీ చేసి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ట్రస్టు సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయి జడ్పీ పీఠంపై పరిటాల శ్రీరామ్..

-మొదటిపేజీ తరువాయి

చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ బాధ్యతలు చేపట్టారు. మరోవైపు కాకినాడ జిల్లా పరిషత్‌లో పదవుల కేటాయింపు వ్యవహారం ఆసక్తికరంగా మారింది.

సత్యసాయి జడ్పీ చైర్మన్‌గా శ్రీరామ్

శ్రీసత్యసాయి జిల్లా తొలి జడ్పీ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లచెరువు జడ్పీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. చైర్మన్ పదవిపై పలు ఊహాగానాలు వినిపించినప్పటికీ చివరకు శ్రీరామ్ పేరును ఖరారు చేశారు. మాజీ ఎమ్మెల్యే పరిటాల రవీంద్ర వారసుడిగా రాజకీయాల్లో కొనసాగుతున్న శ్రీరామ్‌కు ఈ పదవి దక్కడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న ఆయన రాజకీయ ప్రస్థానంలో జడ్పీ చైర్మన్ పదవి కీలక పరిణామంగా మారింది.

కాకినాడలో పదవుల పంచాయితీ

కాకినాడ జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ఎంపిక వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశమైంది. చైర్‌పర్సన్ పదవిని ఆశించిన టీడీపీ జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి అనంతలక్ష్మికి వైస్ చైర్‌పర్సన్ పదవి కేటాయించడంతో ఆమె అసంతృప్తికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆమె నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. కూటమి నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించాలని కోరారు.

ప్రమాణ స్వీకారం చేయకుండానే వెళ్లిపోయిన అనంతలక్ష్మి

నాయకుల విజ్ఞప్తితో జడ్పీ సమావేశానికి హాజరైన పిల్లి అనంతలక్ష్మి కొద్దిసేపు సమావేశ మందిరంలో కూర్చున్నారు. అయితే జడ్పీటీసీ సభ్యురాలిగా కూడా ప్రమాణ స్వీకారం చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. చైర్‌పర్సన్ పదవిని ఆశించిన ఆమెకు వైస్ చైర్‌పర్సన్ పదవి కేటాయించడంపై అసంతృప్తి కొనసాగుతున్నట్లు ఈ పరిణామం స్పష్టం చేసింది. నూతన పాలకమండళ్ల కొలువుదీరిన వేళ కాకినాడలో చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

కడప జడ్పీ పీఠం వివాదం..

రేపు కీలక నిర్ణయం ప్రకటిస్తానన్న ఆదినారాయణరెడ్డి

కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని టీడీపీకి కేటాయించడంపై జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడప జడ్పీ పీఠాన్ని టీడీపీకి ఖరారు చేయడంతో కూటమిలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఈ నిర్ణయంతో అసంతృప్తికి గురైన ఆదినారాయణరెడ్డి తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను కూటమి కోసం ఎంతో నిబద్ధతతో పనిచేశానని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జమ్మలమడుగు పరిధిలో 46 స్థానాలకు గాను 46 స్థానాల్లోనూ విజయం సాధించామని గుర్తుచేశారు. అయితే రాత్రికి రాత్రే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా మార్పులు చేర్పులు చేయాలనుకుంటే తనకు అర సెకన్ కూడా పట్టదని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై అధిష్ఠానంతో చర్చిస్తానని, తన తుది నిర్ణయాన్ని రేపు ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ పదవిని తన సోదరుడి కుమారుడు డాక్టర్ చాదిపిరాళ్ల రాజేశ్ రెడ్డికి కేటాయిస్తారని ఆదినారాయణరెడ్డి ఆశించారు. అయితే అనూహ్యంగా వేరొకరికి కేటాయించడంతో ఈ వివాదం మొదలైంది. మరోవైపు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో ఆదినారాయణరెడ్డి స్వయంగా మాట్లాడారు. తన నిర్ణయం మార్చుకోనేది లేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో చలి పంజా..



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ సీజన్‌లో తొలిసారిగా కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడం గమనార్హం. ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి చల్లటి గాలుల ప్రభావంతో ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం సంగారెడ్డి జిల్లా సత్వార్‌లో 9.6 డిగ్రీలు, కోహిర్‌లో 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పలు జిల్లాల్లో తగ్గిన ఉష్ణోగ్రతలు

కామారెడ్డి జిల్లా డోంగ్లీలో 10.5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 10.7 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో 11 డిగ్రీలు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 12 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా వర్నిలో 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రానున్న మూడు రోజులు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ చలి ప్రభావం పెరుగుతోంది. సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 9 గంటల వరకు చల్లని గాలుల ప్రభావం కొనసాగుతుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు స్వెట్టర్లు, మాస్కులు ధరించి బయటకు వస్తున్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే తరహా వాతావరణం కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

చిన్నారులు, వృద్ధులు జాగ్రత్త

ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చల్లని వాతావరణం కారణంగా జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో వెచ్చని దుస్తులు ధరించాలని, అవసరమైతేనే చలిలో బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. పగటిపూట కూడా చల్లని గాలులు వీస్తుండటంతో అప్రమత్తత అవసరమని చెబుతున్నారు.

తుపాను ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు

మరోవైపు అక్వాన్ తుపాను ప్రభావం తెలంగాణపై పరిమితంగానే ఉండవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తుపాను తీరం దాటిన అనంతరం హైదరాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగి కనిష్ఠంగా 19 డిగ్రీలకు చేరవచ్చని అంచనా వేసింది.

రూ.23 లక్షల ప్యాకేజీ నుంచి నెలకు రూ.60 వేలకే..

ఐఐటీ బాంబే టాపర్ కన్నీటి కథ!

చేరిన కొద్దిరోజులకే స్టార్టప్ మూతపడటంతో కెరీర్‌పై దెబ్బ

ఐఐటీ పట్టభద్రులకూ తప్పని లేఆఫ్స్ కష్టాలు

ప్రిపరేషన్‌కు రూ.20 లక్షల కుటుంబ భారం

ప్రతిభ ఉన్నా దక్కని ఇంటర్న్‌షి అవకాశాలు

ఏఐ రాకతో ఎంట్రీ లెవల్ కొలువులకు ముప్పు

కళ్లల్లో ఎన్నో ఆశలు, లక్షల రూపాయల కోచింగ్ ఫీజులు, నిద్రలేని రాత్రులు.. వీటన్నింటి ఫలితంగా దేశంలోనే అత్యున్నత ఇంజినీరింగ్ విద్యాసంస్థ ఐఐటీ బాంబేలో సీటు సాధించాడు సోహమ్ నాయక్. మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతూనే కోడింగ్ నేర్చుకుని, స్టార్టప్‌లలో ఇంటర్న్‌షిప్‌లు చేసి ఏటా రూ.23 లక్షల భారీ వార్షిక ప్యాకేజీతో కొలువు దక్కించుకున్నాడు. కానీ ఊహించని విధంగా ఆ స్టార్టప్ మూతపడటంతో ఒక్కసారిగా రోడ్డున పడ్డాడు. నెల రోజుల పాటు తీవ్రంగా ఉద్యోగ వేట సాగించినా సరైన ఫలితం దక్కలేదు. ప్రస్తుతం ఎక్స్‌లో పెయిడ్ ప్రమోషన్లు, సొంత ప్రోడక్ట్‌లు తయారు చేస్తూ నెలకు కేవలం రూ.60 వేల నుంచి రూ.70 వేలు మాత్రమే సంపాదిస్తున్నాడు. "ఐఐటీ చదివిన వ్యక్తి ఇంకా మెరుగ్గా స్థిరపడాలని మా కుటుంబ సభ్యులు ఆశిస్తున్నారు. వారు అసంతృప్తితో ఉన్నారు" అంటూ సోహమ్ పెట్టిన పోస్ట్ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది.

ఐఐటీ ట్యాగ్ ఉన్నా తప్పని లేఆఫ్స్

సోహమ్ కథ ఒక్కడిదే కాదు. ప్రీమియర్ సంస్థల నుంచి పట్టభద్రులైన అనేకమంది యువ ఇంజినీర్ల పరిస్థితి ఇలాగే తయారైంది. బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి ఐదు నెలల్లోనే స్టార్టప్ లేఆఫ్‌కు గురైన 24 ఏళ్ల మరో ఐఐటీయన్‌కు మూడు నెలలపాటు ఎన్ని దరఖాస్తులు చేసినా కేవలం రెండు ఇంటర్వ్యూ కాల్స్ మాత్రమే వచ్చాయి. కోడ్‌ఫోర్సెస్ ఎక్స్‌పర్ట్, లీట్‌కోడ్ నైట్‌గా గుర్తింపు ఉన్న మరో పాత ఐఐటీ గ్రాడ్యుయేట్, ఏటా రూ.10 లక్షల ట్రైనర్ ఉద్యోగం వదిలి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వైపు వస్తే ఇంటర్వ్యూ అవకాశాలే లభించడం లేదు. గతంలో అమెజాన్‌లో నెలకు రూ.1.1 లక్షల స్టైపెండ్‌తో ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థి సైతం ప్రస్తుతం నెలకు రూ.70 వేలకు మాత్రమే పనిచేస్తున్నాడు. ప్రఖ్యాత డిగ్రీ చేతిలో ఉన్నప్పటికీ మార్కెట్ ఒడుదొడుకులు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

మధ్యతరగతి తల్లిదండ్రుల గుదిబండ

సాధారణంగా ఐఐటీ లక్ష్యం కోసం 9, 10 తరగతుల నుంచే కోచింగ్ పేరిట లక్షల రూపాయల పెట్టుబడి పెడతారు. కోటా, హైదరాబాద్, ఢిల్లీలలో హాస్టల్ ఖర్చులు, కోచింగ్ ఫీజులు, నాలుగేళ్ల ఐఐటీ ఫీజులు కలుపుకొంటే సగటు మధ్యతరగతి కుటుంబంపై రూ.18 లక్షల నుంచి రూ.27 లక్షల వరకు తీవ్రమైన ఆర్థిక భారం పడుతోంది. తీరా ఇంత భారీ వ్యయం చేసి కొలువుల్లో చేరాక, కొద్ది నెలల్లోనే ఉద్యోగం ఊడిపోవడమో లేదా తక్కువ వేతనాలకే పరిమితం కావడమో వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. మెకానికల్, సివిల్ వంటి కోర్ ఇంజినీరింగ్ విభాగాలు చదువుతున్న విద్యార్థులు సైతం కేవలం సాఫ్ట్‌వేర్, ఏఐ రంగాల వైపే మొగ్గుచూపుతున్నారు. ఏఐసీటీఈ సమాచారం ప్రకారం 2024-25లో ఇంజినీరింగ్ ప్రవేశాలు 75.07 శాతానికి పెరిగినప్పటికీ మెజారిటీ విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ వైపే వెళ్తున్నారు. ఏఐ వల్ల ఉత్పాదకత పెరుగుతుందని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి చెబుతుండగా, ప్రవేశ స్థాయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు క్రమంగా కనుమరుగవుతాయని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?.. సీఎం రేవంత్ ప్రసంగంపై భగ్గుమన్న హరీశ్

-మొదటిపేజీ తరువాయి

ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహాయం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను కేవలం ఆదాయ వనరుగా కాకుండా భవిష్యత్ తరాలకు ఆస్తిగా చూడాలని, వాటి విలువ పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. మన వనరులను మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మూడు బ్లాకుల్లో కలిపి సుమారు 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్‌ను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని సమావేశంలో చర్చించారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెట్టొద్దు

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వం, మంత్రుల పనితీరుపై మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలనలో పారదర్శకత ఉండాలని, రాష్ట్రాన్ని పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టవద్దని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి దాదాపు రూ. 10,000 కోట్ల వరకు నిధులు కేటాయిస్తూ, తీవ్ర వెనుకబడిన మునుగోడును విస్మరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మునుగోడులో రోడ్లు, సాగునీటి పనులు, చౌటుప్పల్‌లో 100 పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి పనులు నిధుల కొరతతో ఆలస్యమవుతున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించిన రాజ్‌గోపాల్ రెడ్డి, ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులైనా నిజాయతీగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. "రాష్ట్రాన్ని దొంగలకు, పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టకండి. నిజాయతీగా, అవినీతి లేకుండా పాలన చేస్తున్నారా లేదా అనేది ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలి అని మంత్రులకు హితవు పలికారు. సొంత పార్టీ ఎమ్మెల్యే బహిరంగంగా ప్రభుత్వంపై వరుసగా ఈ తరహా వ్యాఖ్యలు చేస్తుండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరే

-మొదటిపేజీ తరువాయి

ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని

సత్యసాయి జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్‌గా దాసరి సునేత్ర ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లి





అంకుశం ప్రతినిధిపుట్టపర్తి, నవంబర్, 20: శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ నూతన పాలకవర్గం కొలువుదీరింది. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో అత్యంత కోలాహలంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.ఈ ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్‌గా దాసరి సునేత్ర ఏకగ్రీవ మెజారిటీతో ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ పరిటాల శ్రీరామ్, వైస్ చైర్మన్ దాసరి సునేత్రతో పాటు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల (జడ్పీటీసీ) చేత పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు జడ్పీటీసీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి శ్రీ సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు. నూతన చైర్మన్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కూటమి నాయకులకు, జడ్పీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత,ఎంపీ పార్థసారధి,రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత,మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,మాజీ ఎంఎల్‌సీ గుండుమాల తిప్పేస్వామి ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పెద్ద ఎత్తున హాజరై నూతన పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్





అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 20: – భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (జూజు) ఏర్పాటు ఆవశ్యకత, ఓటరుగా నమోదు కావడం, బాధ్యతగా వినియోగించుకోవడం వంటి పలు అంశాలపై విస్తృత అవగాహన కొరకు క్విజ్, వ్యాస రచన పోటీలు కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ప్రశంసా పత్రాలను అందజేశారు. – అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఈఎల్సి అవగాహన పోటీ కార్యక్రమాల్లో క్విజ్ పోటీలలో 10 మందికి, వ్యాస రచన పోటీల విజేతలకు 10 మంది విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. – జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల నందు విద్యార్థిని విద్యార్థులకు ఓటరు నమోదు మరియు ఓటింగ్ ప్రాముఖ్యతపై నిర్వహించి అందులో ప్రతిభ కనబరచిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించగా, అందులో ప్రతిభ కనబరచిన 83 మందికి జిల్లా స్థాయిలో (ఆర్ట్స్ కళాశాల నందు) విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పాఠశాల మరియు కళాశాల స్థాయి నుండే విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయడం ఎంతో అవసరమని అన్నారు. 8వ తరగతి నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులలో 18 ఏళు నిండిన వారు ఇప్పటికే ఓటర్లుగా నమోదయ్యారని, మిగిలిన హక్కు పొందనున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి డబ్బులు, ప్రలోభాలు లేదా ద్వేషాలకు లోనుకాకుండా, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగల సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులంతా ఓటు హక్కు ఆవశ్యకతను తమ తోటి స్నేహితులకు, సమాజానికి తెలియజేసే బాధ్యత తీసుకోవాలని ఆకాంక్షించారు. మరింత మంది కొత్త విద్యార్థులు ఈ ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్స్ నమోదు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని విద్యార్థులు కలెక్టర్ తో తమ అనుభవాలను పంచుకున్నారు. – ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ణ=ూ) మలోలా, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనక రాజ్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్యుల్, వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

ఎన్టీఆర్ జిల్లా తొలి జడ్పీ చైర్మన్‌గా దళిత మహిళకు అవకాశం


ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలో చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు -- విజయవాడఎంపీ కేశినేని శివనాథ్





అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 20 ఎన్టీఆర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన కోట పుల్లమ్మ, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నూతలపాటి బాల కోటేశ్వరరావులను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. మహానుభావుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) పేరుతో ఏర్పాటైన జిల్లాలో తొలి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఒక దళిత మహిళకు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఎన్టీఆర్ ఏ సామాజిక న్యాయం, సమానత్వం, రాజకీయ అవకాశాల ఆశయాలతో తెలుగుదేశం పార్టీని స్థాపించారో, ఆ ఆశయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు ఆచరణలో చూపిస్తున్నారని పేర్కొన్నారు.ఎన్టీఆర్ పేరుతో ఏర్పాటైన జిల్లాకు తొలి జడ్పీ చైర్మన్‌గా ఒక దళిత మహిళను ఎంపిక చేయడం పట్ల కూటమి నాయకుల నిర్ణయం అభినందనీయమని అన్నారు. పార్టీ కష్టకాలంలోనూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ కోట పుల్లమ్మ పార్టీ కోసం ధైర్యంగా నిలబడ్డారని గుర్తుచేశారు. పార్టీ కోసం పోరాటం చేస్తున్న సమయంలో తన కుటుంబంలో ఒక వ్యక్తిని కోల్పోయినప్పటికీ, ఆమె ఆత్మవిశ్వాసంతో రాజకీయాల్లో కొనసాగారని తెలిపారు.గంపలగూడెం గ్రామంలో సుమారు 8,500 ఓటర్లు ఉన్న పరిస్థితుల్లో గతంలో సర్పంచ్‌గా విజయం సాధించి తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆమె జడ్పీటీసీగా, ఆమె భర్త ఎంపీటీసీగా ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం వారి ప్రజాసేవకు నిదర్శనమన్నారు.పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులు ఆర్థికంగా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ వారిని గుర్తించి సముచిత గౌరవం, అవకాశాలు కల్పించే గొప్ప సంప్రదాయం తెలుగుదేశం పార్టీలో ఉందని ఎంపీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహం, కూటమి పెద్దల సహకారంతో కోట పుల్లమ్మకు ఈ కీలక అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.సాధారణంగా జనరల్ కేటగిరీకి చెందిన జడ్పీటీసీ స్థానం నుంచి చైర్మన్ పదవికి అవకాశం వచ్చినప్పటికీ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఒక మహిళా నాయకురాలికి ఆ అవకాశం కల్పించాలనే గొప్ప ఆలోచనతో కూటమి నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చారని వివరించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఏకగ్రీవంగా కోట పుల్లమ్మ పేరును జడ్పీ చైర్మన్ పదవికి ప్రతిపాదించడం కూటమి ఐక్యతకు, సామాజిక న్యాయం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.అదేవిధంగా భారతీయ జనతా పార్టీ నుంచి ఒకే ఒక్క జడ్పీటీసీ స్థానం గెలిచినప్పటికీ, మిత్రధర్మాన్ని గౌరవిస్తూ ఆ పార్టీకి చెందిన నూతలపాటి బాల కోటేశ్వరరావుకు వైస్ చైర్మన్ పదవి కల్పించడం కూటమి పార్టీల మధ్య ఉన్న సమన్వయానికి, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లు జడ్పీటీసీ సభ్యులందరినీ కలుపుకొని జిల్లాలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎంపీ కేశినేని చిన్ని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతాల నుంచి సాధారణ కుటుంబాలకు చెందిన వ్యక్తులను గుర్తించి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీ నాయకత్వానికే దక్కుతుందని అన్నారు.ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ సాధారణ కుటుంబాలకు చెందిన వ్యక్తులకు, మహిళలకు అవకాశాలు కల్పించడం ద్వారా పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఒక దళిత మహిళను ఎన్టీఆర్ జిల్లా తొలి జడ్పీ చైర్మన్‌గా ఎంపిక చేసి, జిల్లా ప్రథమ పౌరురాలిగా బాధ్యతలు అప్పగించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయం, మంత్రి నారా లోకేష్ సంకల్పానికి నిదర్శనమని స్పష్టం చేశారు.రాజకీయాల్లో నిజాయితీగా పనిచేసే వారికి, పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఈ నిర్ణయం మరోసారి నిరూపించిందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ మరియు ఎజూ నాయకులు తదితరులు పాల్గొన్నారు

యువకుడు, విద్యావంతుడుగా వైస్ ఎంపీపీ తలారి శివయ్య



నమ్మి గెలిపించిన రాప్తాడు పంచాయతీ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు

రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 20 స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్యంగా ఎంపీటీసీగా అవకాశం దక్కిన రాప్తాడు గ్రామానికి చెందిన తలారి శివయ్య ఎన్నికల్లో భారీ మెజార్టీ గెలవడంతోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీతకు టిడిపి మండలం ఇన్చార్జ్ ధర్మవరపు మురళికి నమ్మిన బంటుగా ఉండడంతో వైస్ ఎంపీపీ పదవి దక్కడం శివయ్యతో పాటు ఆయన కుటుంబంలో చెప్పలేని అనుభూతి నెలకొంది. చిన్నప్పటి నుంచి చురుగా ఉండడంతో తల్లిదండ్రులు పెద్ద శివయ్య, నారాయణమ్మ కూడా అల్లారు ముద్దుగా పెంచుతూనే వారి చిన్నపాటి వ్యవసాయ కుటుంబం అయినా ఎంటెక్ వరకు విద్యాభ్యాసం చేయించారు. టిడిపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో ఆయన సేవలను గుర్తించి రాప్తాడు మండల కేంద్రం ఎంపీటీసీగా అవకాశం ఇవ్వడంతో వైస్ ఎంపీపీ స్థానం దక్కింది. ప్రజాసేవలో ఉంటూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని తెలిపారు. యువకుడు, విద్యావంతుడనని నన్ను

అనంతపురంజిల్లా పరిషత్ నూతన చైర్మన్ నాగరాజు, వైస్ చైర్మన్ వెన్నపూస లలిత ఎన్నిక

అనంతపురం జిల్లా నూతన చైర్మన్ నాగరాజును అభినందించిన పయ్యావుల కేశవ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 20 అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రత్యేక సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారితో కలిసి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగరాజు కి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వెన్నపూస లలిత గారికి పూల నాగరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల జడ్పీటీసీలుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

జడ్పిటిసిగా బండి ఉజ్జినమ్మ ప్రమాణ స్వీకారం



బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ నవంబర్ 20 మండల జడ్పిటిసి బండి ఉజ్జినమ్మ జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి బండి ఉజ్జినమ్మ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో ఎన్నికలలో గెలిపించారన్నారు. ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటాను అన్నారు. మండలంలో ఎటువంటి సమస్య వచ్చిన ప్రజలు తమ దృష్టికి నేరుగా తీసుకురావాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. విద్యా వైద్యం మౌలిక సదుపాయాలపై ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు.


ధర్మవరం లో పరిటాల శ్రీ రామ్ కు అభిమానుల జేజేలు!





అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 20 సత్య సాయి జిల్లా జడ్ పి చైర్మన్ గా పరిటాల శ్రీ రామ్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం శుక్రవారం ధర్మవరం విచ్చేసిన టీడీపీ యువ నేత పరిటాల శ్రీ రామ్ కు ధర్మవరం టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమం లో ధర్మవరం టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, టీడీపీ మున్సిపల్ చైర్మన్ పరిసే సుధాకర్, అంబటి సనత్,చేనేత టీడీపీ నాయకులు సందా రాఘవ, తెలుగు యువత విజయ్ చౌదరి ధర్మవరం తిరుమలేష్ నీలయ్య గారి ఫణి కుమార్, ధర్మవరం ఎమ్ పిపి గొట్లూరు శ్రీ నివాసులు, సత్య సాయి జిల్లా టీడీపీ నాయకులు నాగూర్ హుసేన్ రూరల్ టీడీపీ నాయకులు మహేష్ చౌదరి,27 వార్డు కౌన్సిలర్ శ్రీ శైలం పురుషోత్తం గౌడ్ 18 వార్డు కౌన్సిలర్ పల్లెం కృష్ణ సీనియర్ టీడీపీ నాయకులు కిరోసిన్ పోతలయ్య సి. పెద్దన్న తలారి చంద్ర మోహన్ బాబు తలారి రమేష్ వంట రమేష్ తదితరులు తెలుగు మహిళలు పరిటాల శ్రీరామ్ అభిమానులు పలువురు పాల్గొని పరిటాల శ్రీరామ్ కు ఘనంగా స్వాగతం పలికారు. యన్ టి ఆర్ సర్కిల్ లో శ్రీరామ్ కు గజమాల అలంకరించారు. ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీ రామ్ జిల్లా జడ్ పి చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టడం కూటమి ప్రభుత్వం విజయం అని ధర్మవరం తెలుగుదేశం పార్టీ వారు పేర్కొన్నారు.

జనసందోహంతో టీడీపీ అభ్యర్థి రాచమల్ల మల్లేష్ నామినేషన్



బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ నవంబర్ 20 తెలుగుదేశం పార్టీ బలపరిచిన కొర్రపాడు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రాచ మల్ల మల్లేష్ జనసందోహం తో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభ్యర్థి మల్లేష్ కు మద్దతుగా పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడంతో నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యకర్తలు, అభిమానుల సందడితో రోటరీ పురం నుంచి రెడ్డిపల్లి వరకు ద్విచక్ర వాహనాల్లో నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కొర్రపాడు పంచాయతీలో ఎన్నికల కోలాహలం నెలకొంది. భారీగా తరలివచ్చిన జనసమూహం టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో కొర్రపాడు నీలారెడ్డిపల్లి రోటరీ పురం గ్రామానికి చెందిన వందలాదిమంది టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సత్య సాయి జిల్లా జడ్ పి చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన పరిటాల శ్రీ రామ్ కు రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ అభినందనలు!

అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 20 సత్య సాయి జిల్లా జడ్ పి చైర్మన్ గా టీడీపీ యువ నేత పరిటాల శ్రీ రామ్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల రాష్ట్ర బీజేపీ చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ తన హర్షం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సాధించిన అపూర్వ విజయం ఇది అని ఆయన అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం యువ నేత పరిటాల శ్రీ రామ్ కృషి చేయాలని కోరారు.చేనేతల అభ్యున్నతి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం అని గిర్రాజు నాగేష్ పేర్కొన్నారు.



జడ్పీ చైర్మన్ గా పరిటాల శ్రీరామ్ ప్రమాణస్వీకారం...

నా భర్త ఆశయం నెరవేరింది.. ఇది దైవ నిర్ణయంఎమ్మెల్యే పరిటాల సునీత...





అంకుశం న్యూస్, రాప్తాడు, నవంబర్ : 20 రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యువతకు పెద్దపీట వేస్తూ, కొత్త రక్తం మరియు కొత్త ఆలోచనలు పరిపాలనలోకి రావాలని యువనేత నారా లోకేష్ గారు బలంగా నమ్మారని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆ నమ్మకంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాకు తొలి జడ్పీ చైర్మన్‌గా ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించారన్నారు. గతంలో జిల్లాకు, పార్టీకి ఏ కష్టం వచ్చినా పరిటాల కుటుంబం ముందుండి అండగా నిలబడిందని. నా తండ్రి పరిటాల రవి పార్టీని, సామాన్యులను నిలబెట్టడానికి కృషి చేశారన్నారు. మా అమ్మ పరిటాల సునీతమ్మ ఏ విధంగా పనిచేశారో.వారి పేరు నిలబెడుతూ అంతకంటే గొప్పగా పనిచేస్తానన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరి సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తాను. పార్టీ నాపై పెట్టిన బాధ్యతను, పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని శ్రీరామ్ అన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నాడు పరిటాల రవి బి.కె.పార్థసారథిని, నేను చమన్ ను జడ్పీ చైర్మన్లుగా చేశామన్నారు. ఏ జడ్పీ చైర్మన్ పదవి కోసం అయితే పరిటాల రవి ప్రాణాలు పోగొట్టుకున్నారో, నేడు జిల్లా నేతలందరి సహకారంతో అదే చైర్మన్ పీఠంపై మా కుమారుడు శ్రీరామ్ కూర్చోవడం ఒక అదృష్టంగా, దైవ నిర్ణయంగా భావిస్తున్నానన్నారు. ఏ లోకాన ఉన్నా రవి ఎంతో సంతోషిస్తారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరిటాల అభిమానులు, టీడీపీ కుటుంబ సభ్యులందరికీ ఇది పండగ రోజు అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని చెప్పారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిక్షణ పూర్తి చేసుకున్న విష్ణుప్రియకు ఘన సన్మానం

అంకుశం న్యూస్ ఉరవకొండ నవంబర్ 20 : ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న విష్ణుప్రియ నవంబర్ 10 నుండి 19 వరకు హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన పది రోజుల ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిక్షణ శిబిరంలో పాల్గొని నేడు కళాశాలకు తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు విష్ణుప్రియను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు మీరు చేస్తున్న కృషి అభినందనీయమని, మహిళా అధ్యాపకురాలిగా జాతీయ స్థాయి శిక్షణ శిబిరాల్లో పాల్గొంటూ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవడం ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. అదేవిధంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ప్రతినిధి జ్యోతికుమార్ మాట్లాడుతూ, ఉరవకొండ వంటి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జాతీయ సేవా పథకం ద్వారా సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను నేర్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న విష్ణుప్రియ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శైలజారాణి విష్ణుప్రియను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జాతీయ స్థాయి అవకాశాలను పరిచయం చేస్తూ, వారిలో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో విష్ణుప్రియ గారి కృషి ఇతర అధ్యాపకులకు సైతం ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



ఉరవకొండలో ఘనంగా ముగిసిన 59వ గ్రంథాలయ వారోత్సవాలు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి విజేతలకు బహుమతులు అందజేతుండల విద్యాశాఖ అధికారి -2రమాదేవి



అంకుశం న్యూస్ ఉరవకొండ నవంబర్ 20 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉరవకొండలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి .-2 రమాదేవి, జిల్లా పరిషత్ హై స్కూల్ సెంట్రల్ హెడ్ మాస్టర్ ఖాదర్ బాష, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి మరియు మంజుల ముఖ్య అతిథిలుగా పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతో నడవాలని కోరారు. నవంబర్ 14 నుంచి 20 వరకు వారం రోజులపాటు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం అందులో విద్యార్థిని,విద్యార్థులకు విలువైన సమాచారం విజేతలకు ముఖ్య అతిథులతో బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారివై. ప్రతాపరెడ్డి,జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు,పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో ముగింపు సందర్భంగా గ్రంథాలయాధికారి ప్రతాపరెడ్డి సహకరించిన అధికారులకు పాత్రికేయులకు మరియు మీడియా వారికిఅందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

అనంతపురం ఎమ్మెల్యే ఎంపీ

అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 20 విద్యాశాఖమంత్రి నారా లోకేష్ గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ తో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఒకప్పుడు దినపత్రికలు చదవడం మొదలుకొని, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల వరకు అందరూ గ్రంథాలయాలపైనే ఆధారపడేవారని గుర్తుచేశారు. చదువుల తల్లికి నిలయంగా, ఒక దేవాలయం లాంటి పవిత్ర వాతావరణం గ్రంథాలయాల్లో ఉండేదని తెలిపారు. మారిన కాలానికి అనుగుణంగా ప్రస్తుతం సెల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం పెరిగిందని, ఇందుకు తగ్గట్టుగా రాష్ట్రంలోని గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకువస్తూ వాటిని ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వంలో అనంతపురం జిల్లా గ్రంథాలయాన్ని ఆర్డిటీ సహకారంతో



డిజిటల్ లైబ్రెరీగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే ప్రశంసించారు. మంగళగిరిలో 100 కోట్ల భారీ వ్యయంతో దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఒక మోడల్ గ్రంథాలయాన్ని మంత్రి లోకేష్ నిర్మిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో, ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల



చేరికలు భారీగా పెరిగాయని హర్షం వ్యక్తం చేశారు. అలాగే, విద్యార్థులు చదువుకునే సమయంలోనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా నైపుణ్యాలను నేర్పించి, వారు సులభంగా ఉద్యోగాలు సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, భావి భారత పౌరులైన విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాప్తాడు జడ్పీటీసీగా గుండ్లమడుగు జయలక్ష్మి ప్రమాణ స్వీకారం

రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 20 నియోజకవర్గ కేంద్రం రాప్తాడు మండలం టీడీపీ సీనియర్ నాయకుడు గోనపట్ల శీనా సతీమణి గుండ్లమడుగు జయలక్ష్మి శుక్రవారం అనంతపురం జిల్లా పరిషత్ హాల్‌లో రాప్తాడు జెడ్పీటీసీగా ప్రమాణ స్వీకారం చేశారు. పసుపు కండువా ధరించిన ఆమె, సమావేశ మందిరంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో భారత రాజ్యాంగం పట్ల నిబద్ధతతో పనిచేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, నమ్మకంగా నిర్వర్తిస్తానని భగవంతుని సాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాలతో, టీడీపీ మండల ఇన్‌ఛార్జ్ ధర్మవరపు మురళీ సహకారంతో రాప్తాడు మండల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు, టీడీపీ నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



విద్యా ప్రదాత చట్టా వెంకట నారాయణ మృతి తీరని లోటు!

అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 20 ధర్మవరం ప్రభుత్వ బాలికల కళాశాల అభ్యున్నతి కి పాటుపడి హటాత్తుగా మృతి చెందడం పట్ల బెంగుళూరు దాత చట్టా వెంకట నారాయణ మృతి తీరని లోటు అని ధర్మవరం ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మతి ఎమ్. వనితా వాణి బృందం కళాశాల సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు ఆయన కళాశాల కోసం ఎంతో సాయం అందించడం జరిగిందని కళాశాల కమిటీ బండి వేణు గోపాల్ పల్లెం వేణుగోపాల్ లెక్చరర్లు కె. నాగ మల్లికార్జున రామాంజున రెడ్డి యన్. ప్రభాకర్, మునిస్వామి నాయుడు పెద్దన్న లైబ్రరియన్ వెంకట రమణ విక్రమ్ భాష మేరీ ఇండమతి అరుణ వనిత, సునీత జుబిన్ తాజ్ సురేఖ మహాలక్ష్మి ఉమేరా నయీన్,శాంతి చంద్ర కళ విజయలక్ష్మి పద్మజ,శ్రీమతి శోభ తదితరులు తమ ప్రగాఢ నివాళులు అర్పించారు. బాలికల కళాశాల జువాలజీ రూమ్ ఆయన స్వంతంగా రూ 14 లక్షలు వ్యయం తో నిర్మించడం జరిగిందని, ఉచిత భోజనం సదుపాయం 11 సంవత్సరాలనుండి కల్పించి కుట్టు మిషన్లు ఏర్పాటు చేసి వృత్తి విద్య ప్రోత్సాహం అందించారని అన్నారు. డెస్క్ లు కూడా ఏర్పాటు చేసి విద్యార్థిని లకు కళాశాల ప్రగతి కోసం పాటుపడిన విద్యా దాత చట్టా వెంకట నారాయణ సేవలు మరువలేనిది అన్నారు.



ఘనంగా టీటీడీ విద్యుత్ విభాగం ఆయుధపూజ

అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 20 తిరుమల గోగర్భం డ్యామ్ వద్ద టీటీడీ విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుధపూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సబ్ స్టేషన్, ట్రాన్స్ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిఈ శ్రీ చంద్ర శేఖర్, హెల్త్ డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈలు చంద్ర శేఖర్, టీటీడీ ఈఈలు శ్రీనివాసరావు, ప్రసాద్, ఇతర విద్యుత్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం, జ్ఞాపకశక్తి పెంపు

విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో గ్రంథాలయాలది కీలక పాత్ర

-- టిటిడి డీఈవో డా. ఏవీఎన్ శివకుమార్

గ్రంథాలయం సమాచారం, విజ్ఞానం, వివేకాన్ని అందించే జ్ఞాన నిధి : శ్వేత డైరెక్టర్ డా. వేమా వేంకటరత్నం


పుస్తక పఠనం మానసిక వికాసానికి దోహదపడటంతో పాటు జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుందని టిటిడి డీఈవో డా. ఏవీఎన్ శివకుమార్ పేర్కొన్నారు. నిరంతర పఠనం ద్వారా మెదడు చురుకుదనం పెరుగుతుందని, కొత్త పదాలు, విషయాలను నేర్చుకోవడం వల్ల మెదడులోని నాడీకణాలు ఉత్తేజితమవుతాయని తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు శుక్రవారం తిరుపతిలోని టిటిడి శ్వేత భవనంలో గల శ్రీ వెంగమాంబ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పుస్తక పఠనం వల్ల వయసు పెరిగే కొద్దీ ఎదురయ్యే మతిమరుపు సమస్యలను నివారించడంలో కూడా తోడ్పాటు లభిస్తుందన్నారు. యువతలో పఠనాసక్తిని పెంపొందించి, వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. టిటిడి ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర ఆదేశాల మేరకు టిటిడి గ్రంథాలయాలను విద్యార్థులకు మరింత చేరువ చేయడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి గ్రంథాలయాల ఆధునీకరణకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

గ్రంథాలయం విజ్ఞానంతో పాటు వివేకాన్ని పెంపొందించే వేదిక: శ్వేత డైరెక్టర్

శ్వేత డైరెక్టర్ డా. వేమా వేంకటరత్నం మాట్లాడుతూ, గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాకుండా సమాచారం, విజ్ఞానం, వివేకాన్ని అందించే జ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. “సమాచారం మనకు విషయాలను తెలియజేస్తుంది. విజ్ఞానం వాటిని అర్థం చేసుకునే శక్తిని ఇస్తుంది. వివేకం వాటిని సరైన రీతిలో ఉపయోగించుకునే సామర్థ్యాన్ని అందిస్తుంది.

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరిన నల్లమాడ మాజీ సర్పంచ్ రంగలాల్ నాయక్

నల్లమాడ మండలం పెమన కుంటపల్లి తాండకు చెందిన 12 కుటుంబాలు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ లో చేరిక



అంకుశం న్యూస్, నల్లమాడ, నవంబర్: 20 : మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో మాజీ సర్పంచ్ ఆర్కె రంగలాల్ నాయక్,ఆర్కే రమణ నాయక్, ఆర్ జి కృష్ణా నాయక్, తిప్పానాయక్,శ్రీరాముల నాయక్, ఆర్ కమిలి భాయి, బి.చౌలిబాయి, ఆర్హెచ్ శాంతి బాయ్, ఆర్ అక్కులప్ప పనాయక్, ఆర్ శంకర్ నాయక్, తిరుపాల్ నాయక్, కృష్ణ నాయక్ తదితరులు వైఎస్ఆర్సిపి నుంచి తెలుగుదేశం పార్టీ లో చేరారు. నల్లమాడ మాజీ సర్పంచ్ రంగలాల్ నాయక్ మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజల మనిషి అని ప్రజలకు సేవలు చేయాలనే దీక్షతో ప్రజల బాగోగులు చూసుకునే ఏకైక నాయకుడు రఘునాథ్ రెడ్డిని టిడిపి కార్యకర్తలను తన బిడ్డల వలె చూసుకునే వారిని వారు మంత్రిగా ఉన్నప్పుడు నల్లమాడ కు నేను సర్పంచ్ గా ఉన్నప్పుడు పార్టీలకతీతంగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహాయపడ్డారని,నేడు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి లో విమానాల ఫ్యాక్టరీ,పెడపల్లిలో మహిళల ఉపాధి కోసం గార్మెంట్స్,సత్య సాయి బాబా జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించాలని తెలిపినప్పుడు చంద్రబాబు నాయుడు వెంటనే పుట్టపర్తిలో సత్య సాయిబాబా 100 వ జయంతిని వేడుకలను రంగ రంగ వైభవంగా జరిపారని చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, సొసైటీ డైరెక్టర్ నాగే నాయక్, సేవే నాయక్, ంవీందర్ నాయక్, అశోక్ నాయక్, శంకర్ నాయక్, హరిలాల్ నాయక్, నారాయణ నాయక్,బొజ్జె నాయక్, తదితర తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ని కలిసిన జడ్పిటిసిలు



బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ నంబరు 20 శింగనమల నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. ప్రజాసేవే పరమావధిగా, సమష్టి కృషితో అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

శ్రీరంగం శ్రీ రంగనాథస్వామివారికి టీటీడీ ఈవో పట్టువస్త్రాల సమర్పణ

అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 20 తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ వైష్ణవ దివ్యక్షేత్రమైన శ్రీరంగంలోని శ్రీ రంగనాథస్వామివారికి శుక్రవారం టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరంగం ఆలయానికి చేరుకున్న టీటీడీ ఈవోకు ఆలయ జాయింట్ కమిషనర్ శ్రీ ప్రకాష్, ప్రధానార్చకులు శ్రీ సుందరభట్టర్ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి తీసుకెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అధికారులు ఈవోకు తీర్థప్రసాదాలు అందజేశారు. తమిళ కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని 2006 నుంచి టీటీడీ ప్రతి ఏటా శ్రీరంగం శ్రీ రంగనాథస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తోంది. ప్రాచీన శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. అదేవిధంగా, తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం సందర్భంగా శ్రీరంగం ఆలయం నుంచి కూడా ప్రతి ఏటా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ శ్రీవారి ఆలయ బొక్కసం ఇన్‌చార్జి శ్రీ గురురాజస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.